సాక్షి
కాకినాడ
బుధవారం | 9 | ఏప్రిల్ | 2025



కల్యాణం.. రమణీయం

ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది.




ప్రతి రైతు పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

ప్రతి రైతూ పారిశ్రామికవేత్తగా ఎదగాలని జాతీయ వాణిజ్య పరిశోధన, వ్యవసాయ పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు.

8లో

8,900 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేలు క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులు ఉంది.

దోపిడికే ప్రాధాన్యం

- సిండికేటుతో పతనమైన ధాన్యం ధర
- ప్రారంభంలో బస్తా రూ.1,450, ప్రస్తుతం రూ.1,200
- కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించిన రైతులు
- ధర పతనంతో ఎకరానికి రూ.10 వేల వరకు నష్టం
- వేరే దారి లేక నష్టం వచ్చినా అమ్ముకుంటున్న రైతులు



పిఠాపురం ఏరియాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

పిఠాపురం: ప్రైవేటు వ్యాపారులు సిండికేటుగా మారారు. తాము చెప్పిందే ధర అన్నట్టుగా రైతులను దోచుకుంటున్నారు. వేరే దారి లేక వారు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రబీ సీజన్‌లో ప్రైవేటు ధాన్యం వ్యాపారులు రైతులను నట్టేట ముంచుతున్నా అడిగే నాథుడు కనిపించడం లేదు. ప్రస్తుతం గోదావరి డెల్టా, ఏలేరు పరిధిలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోతలు జోరుగా సాగుతుండగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాక ప్రైవేటు వ్యాపారులదే హవాగా మారింది. దీంతో ఒకపక్క దిగుబడులు ఆశించిన స్థాయిలో లేక, మరోపక్క మద్దతు ధర రాక రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు.

జిల్లాలో రబీ సాగు వివరాలు
సాగు చేసిన భూములు 1,58,120 ఎకరాలు
సాగు చేసిన రైతులు – 1.45 లక్షల మంది
ఏటా ధాన్యం దిగుబడి – 5.70 లక్షల టన్నులు
గత రెండు వారాలుగా అమ్మిన ధాన్యం – సుమారు 1.20 లక్షల టన్నులు
రోజూ – 1,500 నుంచి 2,000 టన్నుల ధాన్యం అమ్మకాలు

ఒక్క గింజ సేకరిస్తే ఒట్టు

రబీ వరి కోతలు ప్రారంభించి రెండు వారాలైనా ఇంకా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కొలిక్కి రాకపోవడంతో కోసిన ధాన్యాన్ని రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. తాము తప్ప ఎవరూ కొనేవారు లేరన్న సాకుతో ప్రైవేటు వ్యాపారులు సిండికేటుగా మారి ధరలు అమాంతం తగ్గించేశారు. రబీ కోతల ప్రారంభంలో 75 కేజీల సన్న రకాల ధాన్యం బస్తా రూ.1,450 చెప్పిన వ్యాపారులు కోతలు ముమ్మరం అయ్యాక ఒక్కసారిగా ధరను బస్తాకు రూ.250 చొప్పున తగ్గించేశారు. ప్రస్తుతం 75 కేజీల బస్తాను రూ. 1,200కు మాత్రమే కొంటున్నారు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అమ్ముకుంటున్నారు. దీంతో ఎకరానికి రూ.10 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికే జిల్లాలో 30 శాతానికి పైగా కోతలు పూర్తి కాగా సుమారు 1.20 లక్షల టన్నుల ధాన్యం ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అంచనా వేస్తున్నారు. వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం జిల్లాలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, సన్నరకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,740కి (ఏ గ్రేడ్ రకం) కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కాని ఎక్కడా ఒక్క గింజ కూడా కొన్న ఆనవాళ్లు లేవు.

అమ్మక తప్పడం లేదు



రోజురోజుకు ధాన్యం ధరలు తగ్గించేస్తున్నారు. ఎందుకని అడిగే వారు లేరు. ఎవరికి వారే ఏదో విధంగా ధాన్యం అమ్మడైతే చాలు అన్నట్టుగా అమ్మేస్తున్నాం. కోత కోయక ముందు రూ.1,450 అన్నారు. తీరా కోత కోసాక రూ.1,00 అంటున్నారు. అయినప్పటికి అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో పాటు రైతులకు వేరే దారిలేక వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మాల్సి వస్తోంది. ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10వేల నష్టం తప్పడం లేదు. ప్రస్తుతం అంతా యంత్రాలతో కోతలు కోస్తుండడం వల్ల అంతా పచ్చి ధాన్యమే ఉంటుంది. ప్రైవేటు వ్యాపారులు పచ్చి ధాన్యం ఎలా ఉన్నది అలా కొంటున్నారు. అందుకే వారు అడిగిన ధరకు అమ్మాల్సి వస్తోంది. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే ధాన్యం ఎండబెట్టి పూర్తిగా ఆరిన తరువాత ఎగరబోసి ఏవిధమైన తుక్కు లేకుండా చేసి అమ్మితేనే కొంటారు. అందుకే ధర లేక పోయినా ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నాం.

– కరణం శ్రీను, రైతు, పిఠాపురం

ఆ నిబంధనలు మా పాలిట శాపాలు



ప్రభుత్వం ఒకవేళ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ముందు మేము రైతు సేవా కేంద్రానికి వెళ్లి సమాచారం ఇవ్వాలి. కూపన్ తీసుకోవాలి. తరువాత సిబ్బంది వారికి వీలు కుదిరినప్పుడు వచ్చి శాంపిల్స్ తీసుకెళతారు. తేమ ఎక్కువగా ఉంది బాగా ఆరబెట్టి తీసుకురండి అంటారు. ఇంతలో ఏ వర్షం అయినా వచ్చిందంటే ఉన్న ధాన్యం కాస్తా తడిసిపోతాయి. దీంతో అంతా నష్టమే మిగులుతుంది. ముఖ్యంగా పచ్చి ధాన్యం ప్రభుత్వం కొనదు. దీనివల్ల ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. దీంతో వ్యాపారులు వారి ఇష్టానుసారం ధర నిర్ణయించి కొంటున్నారు. మాకు నష్టాలు తప్పడం లేదు. ఆరబెట్టి అమ్ముదామని కళ్లాల్లో ఉంచిన ధాన్యం రెండు రోజుల క్రితం వచ్చిన వానకు తడిసి పోయాయి. దీంతో చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పచ్చి ధాన్యం కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేస్తే తప్ప ప్రైవేటు వ్యాపారుల హవా తగ్గదు.

– గంధం కృష్ణ, రైతు, కొత్తపల్లి

జీతాలు అందక వెతలు

- మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది
- సార్వా పోయి దాళ్వా వచ్చినా అందని వైనం




సార్వా సీజన్‌లో కళ్లాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: ధాన్యం కొనుగోలు చేసేవారు లేరు బాబోయ్ అని రైతులంటుంటే కొనాలంటే మాకు జీతాలివ్వాలి కదా అంటున్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది. మూడు నెలలుగా జీతాలు లేక ముప్పుతిప్పలు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది. సార్వా సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి మూడు నెలలు అయి దాళ్వా సీజన్ వచ్చినా జీతాలు ఇవ్వకపోవడంతో దాళ్వా ధాన్యం ఎలా కొనాలంటున్నారు. తమ జీతాలు ఇప్పించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందిని ఇలా నియమించారు

ప్రతీ రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ముగ్గురు చొప్పున సిబ్బందిని నియమించారు. ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక హెల్పర్ పని చేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12,000, హెల్పర్‌కు రూ.9,000 వేతనం ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో 280 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు, 280 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 280 మంది హెల్పర్లు ఉన్నారు. వీరికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదని వాపోతున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.12.51 లక్షలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.7.50 లక్షలు జీతాలు పేరుకుపోయాయి.

బతికేదెలా?



మాకు ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తున్నారు. మేము పొలాల్లోకి వెళ్లి శాంపిల్స్ సేకరించి తేమ శాతం చూసి రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఈ ప్రక్రియలో చాలా కష్ట పడాల్సి ఉంటుంది. అయినా మా బాధ్యతగా ఉద్యోగం చేస్తున్నాం. మాకు జీతాలు ఇస్తామని చెప్పిన జిల్లా ఉన్నతాధికారులు వాటి గురించి అడుగుతుంటే పట్టించుకోవడం లేదు. మూడు నెలలుగా జీతాలు అందలేదని ఇటీవల మాకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. ఇలా అయితే మేము ఎలా బతకాలి.

– సీహెచ్ లోవ గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్, ఏకే మల్లవరం, రైతు సేవా కేంద్రం

ఇస్తామన్నారు ఇవ్వడం లేదు



ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు జీతాలు సకాలంలో చెల్లిస్తామని చెప్పారు. తీరా అంతా అయిపోయాకా ఇవ్వడం లేదు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఉండడం లేదు. జీతాల పైనే ఆధార పడి ఉన్న మాకు నెలల తరబడి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–షేక్ సుభాన్, ధాన్యం కొనుగోలు కేంద్రం హెల్పర్, చేబ్రోలు

న్యూస్‌రీల్

13న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీన నిర్వహించనున్నట్లు పిఠాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ త్రివేణి తెలిపారు. ఈమేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్‌లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు)తో పరీక్షకు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తలాష్ – 2కె25 పేరిట రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నన్నయ్య యూనివర్శిటీ వీసీ ప్రసన్న శ్రీ,, ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ హాజరవుతారన్నారు.

సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు



వేద సదస్యం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవునికి చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు మంగళవారం స్వామి, అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన, ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు తులసి దళార్చన నిర్వహించారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు వేయి నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 20 లక్షల ఆదాయం సమకూరింది.

ఘనంగా సీతారాముల వేద సదస్యం

కాగా, రత్నగిరి రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సీతారాముల వేద సదస్యం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు నవదంపతులు సీతారాములను వెండి సింహాసనం మీద, పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని మరో ఆసనంపై ఉంచి పూజలు చేశారు. సీతారాములకు నూతన పట్టు వస్త్రాలను ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు అందజేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, చిట్టి శివ, గంగబాబు, రామాలయ అర్చకుడు దేవులపల్లి ప్రసాద్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహితుడు పాలంకి పట్టాభి కార్యక్రమం నిర్వహించారు.

సింగిల్ నంబర్ లాటరీ స్థావరాలపై దాడులు

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ క్రైం: కాకినాడలో కూటమి నేతల అండదండలతో విచ్చలవిడిగా లక్షల్లో జరుగుతున్న నంబర్ గేమ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బెంగళూరు కేంద్రంగా చేసుకుని దినసరి కూలీలు, నిరుపేదల జీవితాలతో చెలగాటమాటమాడుతున్న సింగిల్ నంబర్ లాటరీల భాగోతాన్ని గత నెల 20న 'కూటమి వారి లాటరీ' శీర్షికన 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై జిల్లా ఎస్పీ బిందుమాధవరావు తీవ్రంగా స్పందించి ఆకస్మికంగా దాడులు చేయించారు. కాకినాడ సాంబమూర్తినగర్ ఫ్లై ఓవర్, సంజయ్‌నగర్ లారీ ఆఫీసు, ఎమ్ఎస్ఎన్ చారిటీస్ నూకాలమ్మ గుడి వద్ద పార్కు తదితర ప్రాంతాల్లో నిత్యం సింగిల్ నంబర్ లాటరీతో పేదల పొట్టగొడుతున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ సింగిల్ నంబర్ లాటరీ స్థావరాలపై ప్రత్యేక పోలీసు బృందాలతో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో కాకినాడ టూటౌన్, త్రీటౌన్ పరిధిలో పలు సింగిల్ నంబర్ లాటరీ స్థావరాలను పోలీసులు గుర్తించారు. నంబర్ గేమ్ ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదును, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ గేమ్‌కు మూలాలు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో ఉన్నాయని తెలియడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మను తుడిచేశారు.. గుండెల్లో గుడిని ఏం చేస్తారు?



కుమారపురం గ్రామ సచివాలయ శిలాఫలకంపై ఉన్న వైఎస్ జగన్ బొమ్మను తుడిచేసిన కూటమి నేతలు

పిఠాపురం: కొన్నేళ్లుగా జరగనంత అభివృద్ధి ప్రజల ముంగిటకే పాలన, అధికారులంతా గ్రామాల్లోనే ప్రజల ముందే పని చేయడం ఇలా ఒకటేమిటి అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు తెచ్చిన ఏకైక నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇదే మాట ప్రతి నోటా వినబడుతోంది. దీన్ని కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజలు జగన్‌ను తలుచుకుని పథకాలు ఇవ్వలేని తమను ఎక్కడ తరిమి కొడతారో అనే భయమో ఏమో ఆయన బొమ్మ లేకుండా చేద్దామనుకుని శిలాఫలకాలపై మాజీ సీఎం పేరుతో ఉన్న బొమ్మలను చెరిపేస్తున్నారు. కానీ ఆయన కట్టించిన భవనాన్ని, పాలనను మాత్రం కావాలంటున్నారు. అదే కార్యాలయంలో ఆయన నియమించిన సిబ్బందితో పనులు చేయించుకుంటూ అది కట్టించిన వారి ఆనవాళ్లు మాత్రం ఉండకూడదనుకుంటున్నారు. దీన్ని చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. బొమ్మను తీయగలరు గాని ఆయన చేసిన మంచిని జనం గుండెల్లోంచి తొలగించలేరుగా అంటున్నారు.

అన్నవరం దేవస్థానం ఆదాయం తగ్గడానికి కారణమేంటి?

- 'సాక్షి' కథనంపై స్పందించిన దేవదాయశాఖ మంత్రి ఆనం
- వెంటనే నివేదిక పంపించాలని కమిషనర్‌కు ఆదేశాలు

సాక్షి ఇంపాక్ట్





మంగళవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం కన్నా రూ.ఆరు కోట్లు అధికంగా ఖర్చు అయిన వైనంపై సంబంధిత అధికారులపై రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'లక్ష్మీ..రావేం మా కొండకి ?' వార్తా కథనంపై దేవదాయశాఖా మంత్రి స్పందించారు. గతేడాది అన్నవరం దేవస్థానం ఆదాయం రూ.135 కోట్లు కాగా, వ్యయం రూ.141 కోట్లుగా నమోదైంది. 2023–24 సంవత్సరంలో మిగిలిన రూ.7.5 కోట్లు నిధుల నుంచి రూ. ఆరు కోట్లు మళ్లించి చెల్లింపులు చేశారు. ఒకప్పుడు ఆర్థికంగా రాష్ట్రంలోనే మంచి స్థానంలో ఉన్న అన్నవరం దేవస్థానానికి ఇటువంటి పరిస్థితి ఏర్పడడానికి కారణాలేమిటనే దానిపై వెంటనే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. తన ఆదేశాలతో బాటు ఆయన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను కూడా జత చేసి పంపించారు. దీంతో బాటు గత మూడేళ్ల ఆదాయ వ్యయాల వివరాలను కూడా పంపించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలను అన్నవరం దేవస్థానం అధికారులకు పంపించిన కమిషనర్ మంగళవారం సాయంత్రంలోగా నివేదిక పంపించాలని ఆదేశించారు. దాంతో దేవస్థానం అధికారులు నివేదిక తయారు చేశారు. 2022–23, 23–24 సంవత్సరాలలో దేవస్థానం వ్యయం కన్నా ఆదాయమే అధికంగా ఉంది. ఇదే విషయాన్ని ఆ నివేదికలో పొందుపరిచారు.

ప్రదక్షిణ దర్శనం కొనసాగించి ఉంటే రూ.8 కోట్లకు పైగా ఆదాయం

2023 అక్టోబర్‌లో దేవస్థానంలో రూ.300 టిక్కెట్‌తో సత్యదేవుని ప్రదక్షిణ దర్శనాన్ని అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రారంభించారు. ఈ ప్రదక్షిణ దర్శనం కోసం దాత సహకారంతో ఆలయంలో నాలుగు మూలలా బంగారు గంధం గిన్నె, బంగారు హుండీ, బంగారు కామధేనువు, బంగారు కల్పవృక్షం ఏర్పాటు చేశారు. భక్తులు వాటిని దర్శిస్తూ స్వామి, అమ్మవారి గర్భాలయం చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. రూ.300 టిక్కెట్ అయినా భక్తులు మొగ్గు చూపేవారు. దీంతో ఆ ఒక్క నెలలోనే రూ.50 లక్షల ఆదాయం వచ్చింది. అయితే ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ తరువాత ఆ దర్శనం నిలిపివేసి రూ.200 టిక్కెట్ మీద అంతరాలయం దర్శనం మాత్రమే చేసుకునే వీలు కల్పించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.200 టిక్కెట్‌తో అంతరాలయం దర్శనం ద్వారా రూ.5.49 కోట్లు వచ్చింది. అదే రూ.300 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనం ఏర్పాటు చేసి ఉంటే రూ.ఎనిమిది కోట్లకు పైగా ఆదాయం వచ్చేది.

విన్యాసాలకు సై

- నేటి నుంచి కాకినాడ తీరంలో టైగర్ ట్రయంఫ్ – 25
- పాల్గొననున్న భారత్, అమెరికా సైన్యాలు



కాకినాడ సూర్యారావుపేట లైట్ హౌస్ వద్ద బీచ్ రోడ్డు మూసివేసి, నిషేధిత ప్రాంతంగా ప్రకటించిన పోలీసులు

కాకినాడ రూరల్: కదన రంగంలో శత్రు దేశాల సైన్యాలను తుద ముట్టించడంలో నైపుణ్యం పెంపొందించుకోవడంతో పాటు విపత్తుల వేళ ప్రజలకు రక్షణగా నిలవడం.. పరస్పర సహకారం అందిందుకునేందుకు వీలుగా ఉమ్మడిగా విన్యాసాలు ఇవీ భారత, అమెరికా సైన్యం చేపడుతున్న టైగర్ ట్రయంఫ్ – 25 ఉమ్మడి విన్యాసాల లక్ష్యం, సముద్ర తీరంలో ఇరు దేశాలకు చెందిన యుద్ధ నౌకల(వార్ షిప్‌ల)తో పాటు నేలపై కూడా విన్యాసాలు చేపట్టేందుకు కాకినాడ తీరంలో సూర్యారావుపేట బీచ్ ప్రాంతంలోని నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే భారత తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో త్రివిధ దళాలు, అమెరికా సైన్యం కాకినాడ చేరుకున్నాయి. బుధవారం నుంచి 12వ తేదీ వరకు సంయుక్త విన్యాసాలు నిర్వహించనున్నారు. ఈ విన్యాసాలు తిలకించేందుకు పబ్లిక్‌కు అనుమతి లేదు. బీచ్ ప్రాంతంలో నిషేధపు ఆజ్ఞలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే బీచ్ రోడ్డును మూసివేశారు. సూర్యారావుపేట లైట్ హౌస్ నుంచి ఉప్పాడ వరకు బీచ్ రోడ్డులో రాకపోకలు నిషేధించారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీచ్‌ను ఆనుకుని ఉన్న సూర్యారావుపేట, పరకాల్వ, పోలవరం, నేమాం తదితర గ్రామాల ప్రజలు బీచ్‌కు వచ్చేందుకు నిషేధం విధించారు. సుమారు 130 మంది పోలీసు సిబ్బంది బీచ్ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని టైగర్ ట్రయంఫ్ విన్యాసాలు సజావుగా జరిగేందుకు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ట్రైనీ ఐపీఎస్ అధికారిణి సుస్మిత బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. మరో వైపు కుంభాభిషేకం, దుమ్ములపేట, సూర్యారావుపేట తదితర మత్స్యకార ప్రాంతాలలో మత్స్యశాఖ అధికారులు మంగళవారం సైనిక విన్యాసాలు నేపథ్యంలో సూర్యారావుపేట బీచ్ వైపునకు ఫిషింగ్ బోట్లను వెళ్లనివ్వ వద్దని హెచ్చరించారు. విన్యాసాలు జరుగుతున్న సమయంలో బోట్‌లో అటుగా వెళితే కేసు నమోదు చేస్తారని, బోట్లు వచ్చే పరిస్థితి కూడా ఉండదని మత్స్యశాఖ ఎఫ్‌డీఓలు నూకరాజు, అనురాధ మైక్ ద్వారా ప్రచారం చేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,500
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

పంజాబ్‌లో వాడపల్లి యువకుడి మృతి

- మృతుడు వైఎస్సార్ సీపీ నేత సముద్రం కుమారుడు
- స్వగ్రామంలో అంత్యక్రియలు



నాగ వెంకట యశ్వంత్ (ఫైల్)

కొవ్వూరు: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో గల లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న వాడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఉప సర్పంచ్ లంకదాసు సముద్రం పెద్ద కుమారుడు నాగ వెంకట యశ్వంత్ (23) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. అమృత్‌సర్‌లో ఓ పరీక్ష రాసేందుకు ఈ నెల 6వ తేదీన తన స్నేహితుడి కలిసి మోటారుసైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కుపర్తల సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో యశ్వంత్‌తో పాటు అతడి స్నేహితుడు, విజయనగరానికి చెందిన గానా సిద్విక్ వర్మ (23) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అమృతసర్ నుంచి ఢిల్లీ తీసుకెళ్లి, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో మంగళవారం మధ్యాహ్నం యశ్వంత్ స్వగ్రామమైన వాడపల్లి తీసుకొచ్చారు. వాడపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న యశ్వంత్ ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. మద్రాసులో ఉద్యోగం కూడా వచ్చింది. ఈ వారంలోనే ఉద్యోగంలో చేరనున్న సమయంలో మృత్యువాత పడడాన్ని కుటుంబ సభ్యులు తట్టుకోలేక పోతున్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), మాజీ ఏఎంసీ చైర్మన్ బూరుగుపల్లి వీర్రాఘవులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

కల్యాణం.. రమణీయం




వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

- వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం
- వాడపల్లికి పోటెత్తిన భక్తులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 7.30 గంటలకు వైభవంగా మొదలైంది. సర్వజగద్రక్షుడైన శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. భక్తుల గోవింద నామ స్మరణ, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వాడపల్లి క్షేత్రం అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవదాయ – ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం.విజయరాజు, డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగాయి.

ప్రత్యేక మంటపంలో..

వాడపల్లి క్షేత్రంలోని విశాలమైన ప్రదేశంలో పంచద్రవ్యాలు, సుగంధ పరిమళాలు, సువాసనలు వెదజల్లే పవ్వులతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మంటపంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో బంగారు, వెండి ఆభరణాలతో సుందరంగా అలంకరించి పల్లకీల్లో ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేద మంత్రోచ్చారణ, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీవారు, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కళ్యాణ వేదికపై కల్యాణ మూర్తులను ఆశీనులు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్ర మండలం నడిపూడికి చెందిన వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, వేదపండితులు, అర్చక బృందం కల్యాణ తంతును నిర్వహించారు. దేవస్థానం తరఫున శ్రీవారికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్‌డీఓ పి.శ్రీకర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మండపేటకు చెందిన రామారెడ్డి – మహాలక్ష్మి దంపతులు శంఖు, చక్ర, నామాలతో అలంకరించిన కొబ్బరి బొండాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా మధ్యాహ్నం మూడు గంటలకు స్వామివారి రథోత్సవాన్ని మాడ వీధుల్లో కన్నుల పండువగా నిర్వహించారు.

పిడుగు పడి రైతు మృతి

నల్లజర్ల: పిడుగు పడి రైతు మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో వెలగాని సత్యనారాయణ (47) తన ఇంటి సమీపంలోని మామిడి చెట్టు వద్ద ఉన్న సిమెంట్ బెంచీపై కూర్చున్నాడు. ఈదురుగాలులతో వర్షం పడుతున్న ఆ సమయంలో పిడుగు పడడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు నబీపేట నుంచి వచ్చి ఇక్కడి ఎంపీపీ స్కూలు వద్ద ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు.

వివాహిత మౌన దీక్ష



రాజుపాలెంలో అత్తారింటి వద్ద మౌన దీక్షకు దిగిన వివాహిత

కిర్లంపూడి: తన కుమారుడికి రావాల్సిన ఆస్తిని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ రాజుపాలెంలోని తన అత్తారింటి వద్ద నాగ వెంకట లక్ష్మి అనే వివాహిత తన కుమారుడు, కుటుంబ సభ్యులతో మంగళవారం మౌన దీక్షకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన నాగ వెంకటలక్ష్మికి కొత్తపల్లి మండలం గోర్స‌కు చెందిన వీరబాబుతో పెద్దల సమక్షంలో వివాహమైంది. కొన్నేళ్ల తరువాత రాజుపాలెంలో వారు స్థిరపడ్డారు. అయితే వీరబాబు మానసిక స్థితి సరిగ్గా ఉండదు. కానీ ఈ విషయం చెప్పకుండానే వివాహం చేశారు. వారికి మగబిడ్డ పుట్టిన తర్వాత ఆమెను అత్తింటివారు దూరం పెట్టారు. కుమారుడికి రావాల్సిన ఆస్తిని వేరే వాళ్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడంతో పాటు ఇదేంటి అని అడిగితే ఇంట్లోకి కూడా రానివ్వకుండా బయటకు వెళ్లగొడుతున్నారు. దీంతో నాగ వెంకటలక్ష్మి తన కుమారుడితో కలిసి దీక్ష చేపట్టింది.

ఎట్టకేలకు పారిశుధ్య నిర్వహణ టెండర్ విడుదల



అన్నవరం దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు దేవస్థానాలలో శానిటరీ మెటీరియల్‌తో సహా క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజడ్ టెండర్ ప్రకటన మంగళవారం విడుదలైంది. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ ప్రొక్యూర్ టెండర్ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం శానిటరీ టెండర్లు పిలిచి ఖరారు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని దాదాపు ఆరు నెలలు ఆలస్యం చేశారు. గత అక్టోబర్‌లో విడుదల కావల్సిన టెండర్ ఆరునెలలు ఆలస్యం వచ్చింది. టెండర్లు దాఖలుకు అభ్యర్థన తేదీ ఈ నెల 16, ప్రీబిడ్ సమావేశం ఈ నెల 17న, టెండర్ దాఖలుకు చివరి తేదీ మే ఒకటి, మే ఐదున టెండర్ టెక్నికల్ బిడ్ తెరుస్తారు. మే 12న ఖరారు చేస్తారు. జూన్ ఒకటి నుంచి కొత్త కాంట్రాక్ట్ ప్రారంభమవుతుంది. కాగా.. చెత్త ట్రాక్టర్ కాంట్రాక్టును టెండర్ పిలవకుండా నెలకు రూ.60 వేలకు అప్పగించడంతో సాక్షిలో వార్త వచ్చిన విషయం తెలిసిందే. దీంతో టెండర్లు పిలిచి, అతి తక్కువకు దాఖలైన రూ.23,990కు ఖరారు చేశారు. దీంతో దేవస్థానానికి నెలకు రూ.30,010 ఆదా అయ్యింది.

ప్రతి రైతు పారిశ్రామికవేత్తగా ఎదగాలి

- నిర్కా డైరెక్టర్ డాక్టర్ శేషమాధవ్
- ఉత్సాహంగా 'ఆవిష్కర్తల కలయిక'



సావనీర్‌ను విడుదల చేస్తున్న శేషుమాధవ్, రవిశంకర్, తారా సత్యవతి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి రైతూ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, వ్యవసాయాన్ని పరిశ్రమగా చేపట్టాలని జాతీయ వాణిజ్య పరిశోధన, వ్యవసాయ పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అన్నారు. రాజమహేంద్రవరం ఐసీఏఆర్ – నిర్కా (సీటీఆర్ఐ)లో మంగళవారం వ్యవసాయంలో ఆవిష్కరణలు – వ్యవసాయం పారిశ్రామికరణ దిశగా ఆవిష్కర్తల కలయిక కార్యక్రమం జరిగింది. అధ్యక్షత వహించిన శేషుమాధవ్ మాట్లాడుతూ వ్యవసాయంలో వాణిజ్యపరమైన వినూత్న ఆవిష్కరణలు, అవకాశాలతో పాటు వాణిజ్య పంటల ఉత్పత్తుల దిగుమతులను తగ్గించుకునే దిశగా రైతులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు కృషి చేయాలన్నారు. న్యూఢిల్లీ ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఐపీటీఎం) డాక్టర్ నీరు భూషణ్ ముఖ్యఅతిథిగా ఆన్‌లైన్‌లో హాజరు కాగా, వారి తరఫున న్యూఢిల్లీ ఐసీఏఆర్ – ఐటీఎంయూ డాక్టర్ వి.విక్రమ్‌సింగ్ ఆన్‌లైన్‌లో సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.రవిశంకర్ మాట్లాడుతూ ఆవిష్కర్తల కలయిక ఆవశ్యకతలను వివరించారు. వాణజ్య వ్యవసాయంపై ఆవిష్కరణలు, విలువ ఆధారిత పదార్థాల తయారీపై రైతుల విజయ గాథలు, కోత అనంతరం వాణిజ్య పంటలలో వివిధ ఉత్పత్తులలో సంకలనం చేయబడిన సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, హైదరాబాద్ ఐసీఏఆర్–నారమ్ మేనేజ్మెంట్ డివిజన్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ హెడ్ ఎస్.సెంథిల్ వినాయగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నటరాజ్, నాబార్డు ఏజీఎం సోము నాయుడు, ఎపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు మాట్లాడారు. అనంతరం 11 మంది ఔత్సాహిక యువత తమ అనుభవాలను వివరించారు. 11 ఎగ్జిబిషన్ స్టాళ్లలో పసుపు, అశ్వగంధం, ఆముదం, మిరప ఉత్పత్తులతో పాటు ఎన్‌జీవో, ఎఫ్‌పీవోలు, ఏపీసీఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) వారి వివిధ ఉత్పత్తులు, రోబోటిక్స్, డ్రోన్స్, జ్యూట్‌బ్యాగులను ప్రదర్శించారు. అనంతరం 17 మంది ఔత్సాహిక ఆవిష్కర్తలను సత్కరించారు.


అనుమానాస్పద స్థితిలో ఉద్యోగిని మృతి



నెల్లి కరుణ మృతదేహం

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నెల్లి కరుణ (28) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. నిడదవోలు రూరల్ ఎస్సై కె.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన నెల్లి వెంకట రమణ, సూర్యకుమారి దంపతులకు ఏకైక కుమార్తె కరుణ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వార్డు సచివాలయ కార్యదర్శిగా ఉద్యోగం సాధించింది. సోమవారం సాయంత్రం విధులను ముగించుకుని కోరుమామిడి గ్రామంలోని ఇంటికి వెళ్లింది. అనంతరం బంధువులతో కలిసి చర్చిలో ప్రార్థన చేసింది. చర్చి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కడుపునొప్పి, కళ్లు తిరగడం, కాళ్లు చేతులు వంకర్లు తిరగడం వంటి సమస్యలతో బాధపడుతున్న కరుణను బంధువులు పద్మ, సుబ్బు కలిసి కారులో నిడదవోలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న కరుణను రాత్రి 9 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కరుణను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గదిలో ఉంచారు. బంధువులు, తల్లిదండ్రులు మాత్రం ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరుణకు పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూశారు. అయితే వివాహం విషయంలో కుటుంబంలో కలహాలు జరుగుతున్నట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. కరుణ మరణ సమాచారం తెలుసుకున్న పట్టణంలోని వివిధ వార్డు సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి తరలివచ్చారు. మృతురాలి కరుణ తల్లి సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.వీరబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కరుణ మృతదేహాన్ని పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ సంతాపం తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వాహనం, నిందితుడితో డిప్యూటీ తహసీల్దార్

రాజానగరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. జాతీయ రహదారిపై జీఎస్ఎస్ వైద్య కళాశాల సమీపంలో సోమవారం రూ.10 లక్షల విలువైన బియ్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఇదే విధంగా మంగళవారం కూడా పైప్రాంతానికి కొద్దిదూరంలో పిరమిడ్‌ను చేర్చి ఉన్న పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై రూ.ఒక లక్ష విలువ చేసే రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ తహసీల్దార్ (పౌరసరఫరాలు) గొలుగూరి బాపిరాజు తెలిపారు. చక్రద్వారబంధానికి చెందిన మాడబోయిన గోపి నుంచి వడిశలేరుకు చెందిన వట్టికూటి మణికంఠ మినీ వ్యాన్‌ను అద్దెకు తీసుకుని, అనపర్తి నుంచి గండేపల్లికి ఈ బియ్యాన్ని రవాణా చేస్తున్నాడన్నారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

అట్టనాణేలతో లెక్కల పాఠాలు



కృష్ణ కామేశ్వర్ సేకరించిన అలనాటి ఎనిమిది రకాల అట్టనాణేలు

- 110 ఏళ్ల క్రితం చలామణి
- సేకరించిన కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: బ్రిటీషు కాలంలో దాదాపు 110 ఏళ్లనాటి ఎనిమిది రకాల అట్ట నాణేలను అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. కాలగర్భంలో కలిసి మరుగున పడిపోయిన ఈ నాణేలు అప్పట్లో అర్ధ రూపాయి, పావలా, బేడా (రెండు అణాలు), అణా, అర్ధణా, కాణి, దమ్మిడి అనే ఎనిమిది రకలుగా చెలామణిలో ఉండేవి. అప్పట్లో ఈ నాణేలను పిల్లలకు లెక్కలు నేర్పడానికి ఉపయోగించేవారని సేకరణ కర్త కృష్ణ కామేశ్వర్ తెలిపారు. అసలైన నాణేలు పిల్లలకు ఇస్తే అవిపోతే అనివార్యమయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వీటిని అట్టతో తయారు చేయించారు. వెండి రంగు, రాగి రంగుతో ఉండే ఈ అట్టనాణేలకు, అసలైన నాణేలకు వ్యత్యాసాన్ని ఎంతో పరీక్షించి చూస్తే తప్ప తెలియదు. ఈ నాణేలను బ్రిటీషు వారు జర్మనీ దేశానికి చెందిన లాంగ్ మన్స్ అనే కంపెనీ ద్వారా తయారు చేయించి మన దేశానికి రప్పించి ఇక్కడ విద్యార్థులకు లెక్కలు నేర్పేవారు. అయితే ఈ పద్ధతి ఎక్కువ కాలం నడవకపోవడంతో ఈ అట్టనాణేలు క్రమేణా అదృశ్యమయ్యాయి. అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన నడింపల్లి రామరాజు 50 ఏళ్ల కిందట అనేక పాఠశాలలను సందర్శించి తిరిగి అట్టనాణేలను సేకరించారు. ఆయన నుంచి తాను సేకరించినట్లు కృష్ణ కామేశ్వర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ధవళేశ్వరం: పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ధవళేశ్వరం కాటన్‌పేటలో భవన నిర్మాణ కూలీ షేక్ బుజ్జి (45) మృతి చెందారు. ధవళేశ్వరం పోలీసుల వివరాల మేరకు.. కాటన్‌పేటలో శివానంద స్కూల్ పక్కన మహ్మద్ షరీఫ్ హుస్సేన్‌కు చెందిన భవనం నిర్మాణం జరుగుతోంది. మంగళవారం కొంతమూరుకు చెందిన షేక్ బషీర్‌బాబుతో కలిసి షేక్ బుజ్జి తాపీ పనికి వచ్చాడు. ఇంటి పిల్లర్ వద్ద బైండింగ్ వైర్ కడుతుండగా, ఆపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగ తగలడంతో.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అదుపుతప్పి భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య షేక్ బీబీజాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ

అల్లవరం: గోడి రెవెన్యూ పరిధి రెల్లుగడ్డ సరిహద్దు ప్రాంతంలోని ఆక్వా చెరువుల వద్ద సోమవారం రాత్రి 14 విద్యుత్ మోటార్లను చోరీ చేశారని ఆక్వా రైతు నడింపల్లి వెంకట సూర్యనారాయణరాజు మంగళవారం అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 హెచ్‌పీ మోటార్లు 14, 1 హెచ్‌పీ మోటార్లు 2 కలిపి మొత్తం 16 మోటార్లు చోరీ చేశారని తెలిపారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యానాం - ద్వారపూడి రహదారిలో ఉప్పుమిల్లి - కుయ్యేరుల మధ్య రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చని చెట్లు

ట్రీనరీ!

ఎడారిలో ఆముదపు మొక్క అయినా మహావృక్షమే అంటారు. మండువేసవిలో నడినెత్తిన సూరీడు చుర్రుమనిపిస్తుంటే కాస్తంత నీడదొరికితే చాలనుకుంటారు ప్రయాణికులు. యానాం – ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం ఉప్పుమిల్లి నుంచి కుయ్యేరు వరకు కిలోమీటరు పొడవునా రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చనిచెట్లు వాహన చోదకులకు ఆహ్లాదాన్ని పంచుతూ, పాదచారులకు ఆశ్రయమిస్తున్నాయి. ప్రకృతి చేకూర్చిన అందమైన ఆర్చిలా పచ్చని చెట్లు రోడ్డుపై ఎండ నుంచి గొడుగు పడుతుంటే ఈ రహదారిలో ప్రయాణించేవారు కొంతసేపు చెట్లనీడన ఆగి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. పంట పొలాల మీదుగా వచ్చే చల్లగాలులను చెట్లు నీడన కూర్చుని ఆస్వాదిస్తున్నారు.

– కాజులూరు